

# అడిగి చూడు...

'వసుధ'

**అమెరికన్ జార్జెట్‌లూ, పాలియెస్టర్‌లూ, ఫారిన్ నైలెక్స్‌లూ, షిఫాన్‌లూ ఫాషన్‌పేరేడ్ జరుపుతున్నట్లు వుందా హాల్లో!**

చిరునవ్వులు "యింత చౌకా?" అన్నట్లు చిందిపడుతున్నాయి ఆ హాల్లో!

మాటలు గలగలా దొర్లిపోతున్నాయి వారి మధ్య!

చూపులు జలజలా పాకిపోతున్నాయి వారి మధ్య!

నవ్వులు పకపకా, గుసగుసా... అంతా 'కళకళ'గా వుందా హాల్లో!

యవ్వనం, గర్వం, అందం, దర్పం, డబ్బు వేటికీ కొరత లేనట్లుంది వాళ్ళకి. అందుకే జోరుగా, ఆ మాటలు, ఆ చూపులూ, ఆ నవ్వులూ, ఆ వయ్యారాలు!

"హల్లో, డాక్టర్!" ఆ మూలనుంచి లాయరు విశ్వనాథ్ కేకేశాడు.

"హల్లో, హల్లో!" అంటూ డాక్టర్ రఘునాథరావు ఎవరి చేతిలోనో యిరుక్కుపోయిన తన చేతిని లాక్కుంటూ అటు నడిచాడు హుందాగా.

ఇద్దరూ ఒకేసారి బయల్దేరారేమో హాలు మధ్యలో కలుసుకున్నాయి యిద్దరి చేతులూ!

అయిదు నిముషాలు పరామర్శలూ,. చూపుల ఆత్మీయతలూ నవ్వులూ కురిసి, వెలిసిపోయాయి వారిమధ్య!

"యిన్ని రోజులనుంచీ కనబడనేలేదు?" ఆరోపణలు 'మేమూ!' అంటూ తయారు!

"ఎక్కడా? హాస్పిటల్‌లో తలమునకలయే పని ఇక యింటిదగ్గర కారు దిగగానే ఈగల్లా ముసురుతారు పేషంట్లు, ఏం చేయమంటారు చెప్పండి?" సంజాయిషీతోటే ప్రశ్న కూడా వేశాడు డాక్టర్.

"అవునవును! జబ్బులకూ, డబ్బులకూ కొదవా డాక్టర్ల దగ్గర" జోక్ వేశాననుకొని నవ్వాడు లాయర్ పెద్దగా.

నవ్వకపోతే వాడు ఏడుస్తాడన్నట్లుగా నవ్వాడు డాక్టర్.

వాడు నవ్వాడని వీడూ!

వీడేడుస్తాడని వాడూ! లోకరీతిగా నవ్వుకున్నారు యిద్దరూ!

'బఫే'కు పిలుపొచ్చింది యింతలో.

ఎవరి ప్లేటు... ఎవరి కోరిక... ఎవరి అభిరుచి వారివిగా పంచుకున్నారు విందు భోజనాన్ని!

పక్కవాళ్ళు ఏం తింటున్నారో చూస్తూ కొందరు...

పక్కవాళ్ళు చూస్తున్నారేమో అన్నట్లు వయ్యారాలుపోతూ కొందరూ... ఆడవాళ్ళు నాజూకులు చిందిస్తున్నారు అక్కడకూడా!

'మగవాళ్ళు తినడానికే పుట్టారు' అన్నట్లు తింటున్నారు కొందరు మగవాళ్ళు.

అంతా కోలాహలం... హాలాహలం జీర్ణించుకున్న శివుడి గరళంలో కదలికలా చిందులు తొక్కుతోంది ఉత్సాహం.

"హల్లో డాక్టర్" కోకిల కంఠం విని తింటున్నవాడల్లా వెనక్కి తిరిగాడు.

"హల్లో మిసెస్ శర్మా! నమస్తే... చాలా కాలమయింది కలిసి" పలకరింపుగా అన్నాడు.

"ఏదీ... డాక్టర్‌గారికీమధ్య మా యిల్లే కనబడటంలేదు" నిష్ఠూరంగా అంది లావాటి శరీరాన్ని వంకరలు తిప్పుతూ మిసెస్ శర్మ.


"అదేంలేదు మేడమ్. పేషంట్లతో తీరికే వుండటంలేదు. శర్మగారు కులాసాయేకదా! ఏరీ, కనబడరేం?"

"ఆయన పార్టీకి రాలేదు. కొంచెం ఆయాసంగా వుంది ఈవెనింగ్ నుంచి. పెద్దపాప సుష్మకు 'ఫీవర్'. ఎవరూ రాకపోతే బాగుండదని నేను వచ్చాను" అంది మిసెస్ శర్మ ముంగురులు ముందుకు తోసుకుంటూ.

"అరే, అలాగా!" డాక్టర్ సానుభూతి చూపించాడు.

"పాపను మీదగ్గరకు తీసుకురావాలనుకున్నాను ఈ రోజు మార్నింగ్. అది యింజెక్షన్‌కు భయపడి నేను రాను అని ఒకటే గొడవచేసింది. సరే రేపటివరకూ చూసి, తీసుకువద్దామని వూరుకున్నాను. పాపకు వారం వారం ఏదో ఒకటి... తలనెప్పి, జలుబు, జ్వరం... ఏం యిస్తే పోతుందంటారు డాక్టర్? పాలూ, పళ్ళు అన్నీ యిస్తూనేవున్నా చిక్కిపోతుంది. ఏదయినా మంచి టానిక్స్, యింజెక్షన్స్ యిప్పించమంటారా? దానికి యింజెక్షన్ చూస్తేనే భయమే!"

## సామెతల కథలు




రాక్షసుడొకడు శివుణ్ని గురించి ఘోరతపస్సు చేసాడు. శివుడు అతని భక్తికి మెచ్చి ప్రత్యక్షమై, ఏ వరం కావాలో కోరుకోమన్నాడు. అప్పుడా రాక్షసుడు "నా చేతిని ఎవరి నెత్తిన పెట్టితే వాడు భస్మమైపొయ్యే" వరాన్ని ప్రసాదించమని శివుడ్ని కోరాడు. శివుడా భక్తునికి ఆ వరాన్ని ప్రసాదించాడు.

అసలే కోతి, కల్లు తాగింది, నిప్పు తొక్కింది అన్నట్టు, ఆ వరాన్ని పొందిన రాక్షసుడు, ఆ వర ప్రభావం, నిజమో, అబద్ధమో, శివునిమీదే ప్రయోగించి తెల్సుకోవాలనుకున్నాడు. తన యీ కోరికనుకూడ శివునకు విన్నవించాడు. అది విన్న శివుడు తన తప్పును తెల్సుకొన్నాడు. అతడి మూర్ఖత్వాన్ని గ్రహించాడు. చేయగల్గిందేమీ లేదు. భయపడ్డాడు. భయపడి పారిపోతున్న శివుని వెంట రాక్షసుడు పడ్డాడు. శివుడు వైకుంఠానికి పరుగెత్తాడు.

జరిగినదంతా తెల్సుకున్న విష్ణుమూర్తి, మోహిని రూపంలో, రాక్షసునిముందు ప్రత్యక్షమయ్యాడు. ఆ అందాలసుందరిని చూడగానే, ఆ రాక్షసుడి మనస్సు చలించింది. శివుని మర్చిపోయాడు ఆ సుందరి వెంటపడ్డాడు. ఆమె పొందును కోరాడు. ఆ సుందరి, తనను కోరుకునే పురుషునికి సర్వ విద్యలూ తెలియాలనీ, తనలా నాట్యంచేసి తనను మెప్పించితే, తాను వప్పుకుంటాననీ, అతడి దాననవుతాననీ చెప్పింది. ఆ రాక్షసుడు దానికి వప్పుకున్నాడు.

# భస్మాసుర హస్తం

అభినయిస్తూ, ఆమె తన చేతులను నెత్తి మీద పెట్టుకున్నది. ఆ మూర్ఖుడు, ఆ సుందరి తన్మయత్వంలోపడి ఆమె ననుసరించి, ఆమెను తృప్తిపర్చాలనీ, తన చేతులను, తన నెత్తినే పెట్టుకున్నాడు

తన హస్తాలతోనే, తనను భస్మం చేసుకున్న ఈ అసురుని కథపై వచ్చిందే "భస్మాసుర హస్తం" పలుకుబడి.

ఈనాడు, మరొకరి నెత్తిన చేతులుపెట్టి "సురులు" (దేవతలు)గా చెలామణి అవుతున్న కలియుగ అసురుల కథలు కోకొల్లలు.

*పద్మావతీ గంగాధర్*

యిలాగే పాపకు ఉన్న భయాలూ, వీక్‌నెస్‌లూ వివరించి, అరగంట తర్వాత "దీనికేం మందులు లేవా డాక్టర్ ?" అని ఫుల్‌స్టాప్‌తోపాటే, క్వొశ్చన్‌కూడా వేసి, గట్టిగా వూపిరి పీల్చుకుని నిట్టూర్చింది మి. శర్మ! డాక్టర్‌కు తింటున్న జిలేబీ గొంతులో అడ్డం పడ్డట్లయింది.

"అరే, లేకేం! యింతకీ మీరు పాపను తీసుకొస్తే చెకప్‌చేసి ప్రిస్క్రైబ్ చేస్తాను" అన్నాడు మొహమాటంగా.

"అది భయపడుతుంది మీ పేరు చెప్తేనే! ముందేదన్నా మంచి టానిక్ చెప్పండి. తగ్గాక ఒకరోజు మీ దగ్గరికి పిలుచుకువస్తాను లేదంటే మీరే వచ్చి చూద్దురు!" ఆర్డర్ జారీచేసినట్లే అంది.

తప్పదన్నట్లుగా చూసి, భోజనం ముగించి, తన జేబులోంచి విజిటింగ్ కార్డు వెనక ఖాళీలో... లాయర్‌ను అడిగి తీసుకున్న పెన్నుతో రెండు ఖరీదయిన టానిక్‌ల పేర్లు రాసి. "యివి యివ్వండి ప్రస్తుతం జనరల్ పిక అప్‌కు" అన్నాడు అందిస్తూ.

"థాంక్యూ డాక్టర్! మరి వస్తాను" అంటూ మరోవైపుకు కదిలిపోయింది మిసెస్ శర్మ.

"బ్రతికించారు తల్లీ!" స్వగతంగా అనుకుంటూ, "చూశారుకదండీ! ఎక్కడికి వెళ్ళినా పేషంట్లూ, జబ్బులూ వదలవు మమ్మల్ని! అరగంట వూదరకొట్టింది. దీనికంతా నేను ఛార్జీ చేస్తే ఏమి చేస్తుందో! యిదిమటుకు కన్సల్టేషన్ కాదూ!" డాక్టర్ విసుగ్గా అన్నాడు.

"ష్యూర్! యిటీజ్ ఆల్సో ఎ టైప్ ఆఫ్ కన్సల్టేషన్! యు కెన్ ఛార్జ్ ఫర్ యిట్" లాయరు అన్నాడు.

"మీరే చూశారుగా! యిలా నాకున్న కొద్దిపాటి విశ్రాంతి కాలాన్ని యిలా విసిగించి, వేస్ట్ చేసినందుకు న్యూసెన్స్ కేసు కూడా పెట్టవచ్చు అంటాను. ఏం లాయర్ ?" అడిగాడు డాక్టర్.

"ష్యూర్! యూ హావ్ దట్ రైట్" లాయర్ చెప్పాడు.

"పేషంటును తీసుకురాకుండా మందులు రాసిమ్మంటారు. ఇదెలా కుదుర్తుందని అడిగితే కోపం తెచ్చుకుంటారు." అంటూ తనను విసిగించేవాళ్ళను ఏమేం చేయగలడో, ఏమేం చేయవచ్చో డిస్కస్ చేశాడు ఒక అరగంటసేపు. ఇంతలో పార్టీ ముగిసిపోయింది.

"వీడ్కోలు సంబరాలు .. ఫేర్‌వెలులూ... థాంక్యూలూ... నోమెన్షన్‌లూ... థాంక్యూ వెరీమచ్‌లూ... ప్లీజ్ డోంట్‌మెన్షన్‌లు"లతో హాలు మరోసారి కళకళలాడి, కొంచెంసేపట్లోనే మొగుడి చచ్చిన పాతికేళ్ళ యువతి జీవితంలా నిశ్శబ్దంగా, గందరగోళంగా మిగిలిపోయింది.

హాలునిండా తినిపడేసిన పళ్ళాలూ, తాగిపారేసిన గ్లాసులూ, మిగిలిపోయిన పదార్థాలూ, జరిగిపోయిన కుర్చీలూ... మిగిలిపోయాయి

* * *

డిస్పెన్సరీకి వచ్చి, బోయ్ అందించిన నమస్కారం అందుకుని, స్ప్రింగ్ డోరు తెరచుకుని తన టేబిల్‌ముందు కూర్చున్నాడు డాక్టర్. టేబుల్‌మీది చీటి తిప్పి చూశాడు.

"రాత్రి 9 గంటల నుంచి 9–35 నిముషముల వరకూ కన్సల్టేషన్ ఫీజు 25 రూ॥లు... లాయర్ విశ్వనాథ్!" అని వుంది దాంట్లో.